గుంతల చింత తీరేదెన్నడు?

- అధ్వానంగా మాధవనగర్ ఆర్వోబీ రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు




మాధవనగర్ ఆర్వోబీ వద్ద గుంతల రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

నిజామాబాద్ రూరల్: నగర శివారులోని మాధవనగర్ ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి)పనుల వద్ద రోడ్డు మొత్తం పూర్తిగా గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్వోబీ ఎప్పుడు పూర్తవుతుందో? గుంతల చింత ఎప్పుడు తీరుతుందోనని ఎదురుచూస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

మాధవనగర్ వద్ద ఆర్వోబీ పనులు ఆరు నెలలుగా సాగడం లేదు. దీంతో అసంపూర్తి పనులతో, అధ్వాన రహదారితో వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. రహదారిపై లైటింగ్ లేకపోవడంతో రాత్రివేళల్లో గుంతలు తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుపైగల గుంతల్లో నుంచి రాకపోకలు సాగించడంతో వాహనాలు చెడిపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అప్పుడప్పుడు పెద్ద పెద్ద గుంతల్లో వాహనం ఇరుక్కుపోవడంతో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. పలు సందర్భాల్లో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. దీంతో వాహనదారులు ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని, లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత



ఆర్వోబీ వద్ద రోడ్డుపై గుంతలో నిలిచిన నీరు




రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

మరమ్మతులు చేపట్టాలి..

మాధవనగర్ ఆర్వోబీ పనుల వద్ద రోడ్డు అధ్వానంగా ఉంది.ఆర్వోబీ వద్ద లైటింగ్ వ్యవస్థ, ప్రమాద సూచికలు ఏవీ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టి, సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.

–కాశీనాథ్, నాందేవ్‌వాడ

ప్రమాదాలు జరుగుతున్నాయి..

రోడ్డంతా గుంతలమయంగా మారడంతో వాహనాలు గుంతల్లో ఇరుక్కోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. బైక్‌లు అదుపుతప్పి పడిపోతున్నాయి. అలాగే ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. అధికారులు యుద్ధప్రతిపాదికన మరమ్మతులు చేపట్టి ప్రయాణీలకు ఇబ్బందులను తొలగించాలి.

–నర్సయ్య, గంగాస్థాన్ వాసి

ఇబ్బందులు పడుతున్నాం..

ఆర్వోబీ పనుల వద్ద రోడ్డు మొత్తం కంకరతేలి గుంతలమయం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు గుండా నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది.

–అశోక్, సుభాష్‌నగర్

లైటింగ్ వ్యవస్థ లేదు..

మాధవనగర్ ఆర్వోబీ వద్ద రాత్రివేళ విద్యుత్ దీపాలు లేకపోవడంతో చీకట్లోనే రాకపోకలు సాగిస్తున్నాం. చీకట్లో గుంతలు తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ దీపాలు, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

–దేవేందర్, సాయినగర్

సర్వే పారదర్శకంగా జరగాలి



ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న మంద మకరందు

నిజామాబాద్ సిటీ: ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా బల్దియా సిబ్బంది చేపట్టిన ఇంటింటి సర్వే పారదర్శకంగా ఉండాలని నగర మున్సిపల్ కమిషనర్ మంద మకరందు అన్నారు. ఇంటింటి సర్వేలో భాగంగా ఓటరు జాబితాలోని ఓటరు వివరాలు స్వయంగా వారి ఇంటికి వెళ్లి అధికారులు పరిశీలిస్తున్నారు. బూత్‌లెవల్ ఆఫీసర్లతోపాటు బల్దియా అధికారులు సైతం డివిజన్ల వారిగా ఇంటింటి సర్వే చేపట్టారు. ఈక్రమంలో పెద్ద బజార్‌లో ఆదివారం నిర్వహించిన సర్వేను కమిషనర్ పరిశీలించారు. సర్వే చేస్తున్న బీఎల్‌వోలతో మాట్లాడి సర్వే తీరును తెలుసుకున్నారు. ఇంటింటి సర్వే పూర్తి పార దర్శకతతో ఉండాలని, తప్పులుంటే సవరించాలని సూచించారు. కార్యక్రమంలో బల్దియా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విమర్శలు మాని అభివృద్ధి చేయండి

డిచ్‌పల్లి: కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్ష పార్టీ నాయకులపై విమర్శలు చేయడం మానుకొని అభివృద్ధి పనులు చేపట్టాలని డిచ్‌పల్లి మండల బీఆర్‌ఎస్ నాయకులు హితవు పలికారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. స్థాయిని మరిచి విమర్శిస్తే తగిన బుద్ధిచెబుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయిందన్నారు. నాయకులు లక్ష్మీనర్సయ్య, కృష్ణ,సాయిలు,పద్మారావు, నర్సయ్య, సుదాం, యూసుఫ్, గంగాధర్, నయీం, బుచ్చమ్మ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధర్నాను జయప్రదం చేయండి



డిచ్‌పల్లి: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఈ నెల 30న జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి జేపీ గంగాధర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం 'చలో హైదరాబాద్' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించి, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. సంఘ ప్రతినిధులు సుప్రియ, శైలజ, మౌనిక, స్రవంతి, పద్మ పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలుపర్చాలి



నిజామాబాద్ సిటీ: కేజీబీవీ, మోడల్ స్కూల్, హాస్టల్స్‌లో పనిచేస్తున్న నాన్‌–టీచింగ్ వర్కర్స్‌కు కనీస వేతనాలు అమలు చేయాలని, వారి సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్కె సుధాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో ఆదివారం ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. నాన్ టీచింగ్ వర్కర్స్ సమస్యలు, వాటి పరిష్కారాలు, భవిష్యత్ కార్యక్రమాలను చర్చించారు. నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. సుధాకర్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు పనిభారం తగ్గించడం, జాబ్‌చార్ట్, వీక్లీ ఆఫ్ అమలు, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. నాయకులు ముత్తెన్న, వెంకన్న, ఈశ్వరి, హేమలత, సుమలత, ప్రశాంతి, సంధ్య, సుజాత, దివ్య శోభ, రాధ, లత రమ, శారద, సరోజ, ఉమా, సరస్వతి, అరుణ, జ్యోతి, విక్టోరియా, సునీత, పాల్గొన్నారు.

రుణమాఫీ డబ్బులు జమ చేయాలి

నిజామాబాద్ సిటీ: రుణమాఫీ డబ్బులు రైతుల ఖాతాలో జమ కాలేదని, ప్రభుత్వం వెంటనే డబ్బులు జమ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని మల్లు స్వరాజ్యం భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 9నెలలు గడిచిపోయింది. అయినా ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి, పూర్తిచేయలేదన్నారు. దీంతో రుణమాఫీ కానీ రైతులు బ్యాంకుల చుట్టూ, సొసైటీల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించి, సన్న, దొడ్డు రకాలకు రూ. 500 బోనస్ ఇవ్వాలన్నారు. నాయకులు గంగాధరప్ప, గోగుల చిన్న సాయిలు, ముత్తన్న, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం- అనర్థాలపై అవగాహన



నందిపేట్(ఆర్మూర్): సీహెచ్ కొండూరులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కార్యక్రమ అధికారి లక్ష్మణ్ శాస్త్రి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వల్ల వ్యాధుల గురించి వాలంటీర్లు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ఉమ్మెడ బ్రిడ్జ్, ఉమామహేశ్వర దేవాలయం, గోదావరి నదిలో నిమజ్జనం తర్వాత ఉన్న ప్లాస్టిక్ చెత్తను తొలగించారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిందిగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజ్ కుమార్ సూచించారు. తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ రవీందర్ రెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ఎడపల్లి(బోధన్): మంగళ్‌పహాడ్, కుర్నాపల్లి, ఠాణాకలాన్ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎడపల్లి బీజేపీ సీనియర్ నేత కందగుట్ల రాంచందర్ దుస్తులు పంపిణీ చేశారు. 17 గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులతో సిబ్బందికి తన వంతు సేవా కార్యక్రమాలతో పాటు దుస్తుల పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ఠానాకాలన్ గ్రామంలో కొమరం భీం విగ్రహ ఏర్పాటు కోసం తన వంతుగా రూ.10 వేలను విరాళంగా అందించారు. తాజా మాజీ సర్పంచ్ బట్టు హన్మాండ్లు, బీజేపీ నాయకులు సుర కిరణ్, రవితేజ, భూషణం, కొప్పుల రాములు, మల్లెపూల శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దాలి



నగరంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్‌ను చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ అడిషనల్ కమిషనర్ శంకర్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాకేంద్రంలో మున్సిపల్ అధికారులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం స్వచ్ఛత ర్యాలీలు నిర్వహించారు. చెత్త సేకరణ, చెత్త తొలగింపు, తడి చెత్త, పొడి చెత్త, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై నగరవాసులకు అవగాహన కల్పించారు. శంకర్ మాట్లాడుతూ.. నగర పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం రోడ్లపై చెత్తను తొలగించారు. రఘునాథ చెరువు పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. బల్దియా అధికారులు నటరాజ్ గౌడ్, సునీల్, శ్రీకాంత్, మహేష్, జవాన్లు భజరంగ్, గోపి ఉన్నారు.

కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎస్‌హెచ్‌వో రవి కుమార్

పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో రవి కుమార్ సూచించారు. ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ పాఠశాలలో నిర్వహించిన అర్బన్ పాఠశాలల క్రీడా పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఎస్‌హెచ్‌వో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు స్నేహితులతో గ్రూపు డిస్కషన్స్ చేస్తూ విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. అలాగే స్మార్ట్ ఫోన్‌ను వ్యసనంగా మార్చుకోవద్దన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఎంఈవో రాజగంగారం, క్షత్రియ విద్యా సంస్థల యాజమాన్యం అల్జాపూర్ గంగాధర్, దేవేందర్, క్రీడల కన్వీనర్ శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీ నరసింహ స్వామి, పీఈటీలు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆవిర్భావం చరిత్రాత్మక సందర్భం



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

బోధన్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) ఆవిర్భావ నేపథ్యం విప్లవోద్యమ చరిత్రలో చారిత్రాత్మక సందర్భమని పీడీఎస్‌యూ మాజీ నాయకుడు, పట్టణ ప్రముఖుడు జి.శివరాజు అన్నారు. పీడీఎస్‌యూ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణ కేంద్రంలోని తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో నిర్వహించిన డివిజన్ స్థాయి పీడీఎస్‌యూ పూర్వ, ప్రస్తుత విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, రంగవల్లిల రక్తతర్పణతో బిగిపిడికిలి జెండాతో ఏర్పడిన పీడీఎస్‌యూ నాటి నుంచి నేటి వరకు విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. ఈ నెల 30న హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో రాష్ట్ర స్థాయి స్వర్ణోత్సవ సభ జరుగునుందని, ఈ ప్రాంతం నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ మాజీ నాయకులు సంజీవ్ కుమార్, గంగారాం, మల్లేష్, బలరామరాజు, లింగం, గణేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేందర్, గణేష్, ప్రతినిధులు మౌనిక, గంగాకిషోర్, మహిపాల్, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం

రుద్రూర్: ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయాలని, పార్టీని బలోపేతం చేసే దిశగా కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం వర్ని ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ పిలుపునిచ్చారు. సీపీఎం రుద్రూర్ గ్రామ శాఖ మహాసభ ఆదివారం గంగాధర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బస్టాండ్ చౌరస్తాలో పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం పార్టీ ప్రతినిధుల సభలో గత మూడేళ్ల కాలంలో చేసిన ఉద్యమాలపై సమీక్ష చేసి, భవిష్యత్ కార్యాచరణపై పలు తీర్మానాలు చేశారు. రుద్రూర్‌లో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులైన పేదలకు ఇచ్చేటట్లు చూడాలని సభలో తీర్మానించారు. మహాసభలో సీపీఎం రుద్రూర్ గ్రామ కార్యదర్శిగా నెల్లూరి లక్ష్మణ్, భీమయ్య(హమాలి), గంగాధర్(చేతి వృత్తిదారుల), గంగారాం(కేవీపీఎస్), సురేష్(ట్రాక్టర్ డ్రైవర్స్), గంగాధర్(డీవైఎఫ్ఐ)లను పార్టీ తరఫున ఆ సంఘాల బాధ్యులుగా ఎన్నుకున్నట్లు నన్నేసాబ్ తెలిపారు.

రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న బీజేపీ నేత కలిగోట గంగాధర్

ఆర్మూర్‌టౌన్: రుణమాఫీ చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచిపోయారన్నారు. రైతులను ఇబ్బందిపెట్టిన ఏ ప్రభుత్వం రాష్ట్రంలో బాగుపడలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్య సలహాదారుడుగా బాధ్యతలు తీసుకున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి రైతులకు రుణమాఫీ, పెట్టుబడి సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కట్టమైసమ్మ పండుగ



జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలో ఆదివారం కట్ట మైసమ్మ పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో డప్పువాయిద్యాలతో బోనాలను ఊరేగించారు. అనంతరం చెరువు కట్ట వద్ద ఉన్న మైసమ్మకు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు బాల్‌కిషన్, నర్సారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గంగారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




తాడెం గ్రామంలో బోనాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు.. కంజర్ గ్రామంలో..

వైభవంగా బోనాల పండుగ

మోపాల్: మండలంలోని తాడెం, బోర్గాం(పి), కంజర్ గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామదేవతలకు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు.



బోర్గాం(పి)లో..



ఘన్‌పూర్ గ్రామంలో ఊరపండుగ నిర్వహిస్తున్న గ్రామస్తులు

భక్తిశ్రద్ధలతో ఊరపండుగ

డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో ఆదివారం గ్రామస్తులు, వీడీసీ ఆధ్వర్యంలో ఊరపండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో గ్రామదేవతల ఊరేగింపు సందర్భంగా నిర్వహించిన పోతరాజులు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రజలు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు.

మోదీకి మద్దతుగా నిలవాలి



మాక్లూర్: యువత ప్రధాని మోదీకి మద్దతుగా నిలవాలని బీజేపీ మండల అధ్యక్షుడు రామవత్ సురేష్ నాయక్ కోరారు. ఆదివారం రాంపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సురేష్‌నాయక్ మాట్లాడుతూ.. దేశ ప్రధాని మోదీని ప్రపంచదేశాలు గుర్తిస్తున్నాయన్నారు. అన్ని వర్గాల ప్రజలు బీజేపీ సభ్యత్వం తీసుకోవాలని కోరారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)


24 క్యారెట్స్	75,400	వెండి (కిలో)	92,000
22 క్యారెట్స్	69,467	- నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	28	50	గాజరుగడ్డ	40	70
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	25	50
బీరకాయ	50	80	దోసకాయ	25	50
దొండ	40	60	ఆలుగడ్డ	30	50
బీర్నీసు	60	90	గోబిగడ్డ	20	40
కాకర	40	80	గోబిపువ్వు	50	75
వంకాయ	30	60	బీట్‌రూట్	30	50
పాలకూర	70	110	కరివేపాకు	40	60
మెంతికూర	90	140	చామగడ్డ	40	60
కొత్తిమీర	80	120	గోరుచిక్కుడు	30	50
పుదీనా	80	120	చిక్కుడుకాయ	70	100
క్యాప్సికం	50	75			

- సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	35: చిన్నకథ కాదు (తెలుగు)-4.30, మత్తు వదలరా(తెలుగు)- 7.20 10.25
స్క్రీన్-2	సరిపోదా శనివారం (తెలుగు) - 1.30 7.25
స్క్రీన్-3	ట్రాన్స్‌ఫార్మర్స్ (ఇంగ్లీష్ 3డీ) - 11.00, 4.40, 10.35, ప్రేమనగర్ (తెలుగు) - 7.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఫైలం పిలగా(తెలుగు)-1.15, మత్తు వదలరా-2-4.00,7.00, 10.00
స్క్రీన్-2	ట్రాన్స్‌ఫార్మర్స్ వన్(3డీ ఇంగ్లీష్) - 11.00, 4.35, యుద్ధ (హిందీ) - 1.30, 7.05 స్త్రీ - 2 (హిందీ) - 10.10
స్క్రీన్-3	35 : మత్తువదలరా-2 -1.15, సరిపోదా శనివారం - 4.15 10.30, తుంబడ్ (హిందీ) - 7.50
స్క్రీన్ -4	టికెట్స్ (తెలుగు)-9.55, తుంబడ్(హిందీ) - 12.35, యుద్ధ(హిందీ)-3.15, ప్రేమాభిషేకం-6.20, ప్రేమనగర్(తెలుగు)-10.10
లలితామహల్	సరిపోదా శనివారం (తెలుగు)
దేవి	మత్తువదలరా-2 (తెలుగు)
నటరాజ్	యుద్ధ (హిందీ)
విజయ్	ఎ.ఆర్.ఎం 3డీ (తెలుగు)

దుర్గామాత మండపానికి భూమి పూజ



నిజామాబాద్ రూరల్: నగరంలోని వివేకానంద కాలనీలో దుర్గామాత మండపం ఏర్పాటుకు ఆదివారం భూమి పూజ నిర్వహించారు. లలితాదేవి ఆశ్రమాలయ పురోహితులు వేలేటి రాజేందర్ శర్మ, వివేకానంద వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు అట్లూరి మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి చెరుకుల లక్ష్మణ్‌గౌడ్, కోశాధికారి తిరుపతి పాల్గొన్నారు.

నేడు జక్రాన్‌పల్లికి ఎమ్మెల్యే రాక

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జక్రాన్‌పల్లిలో సెంట్రల్ లైటింగ్ ప్రారంభోత్సవం, మండలస్థాయి క్రీడాపోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.